# పాపం సుబ్బారావు !

సుబ్బారావు తెలివితక్కువవాడు అనడానికి వీల్లేదు. అతనెప్పుడో వద్దెనిమిదేళ్ళ క్రితం పాత ఇంటర్మీడియట్ ఫస్టు క్లాసులో పాసయి, అయిదేళ్ళు ఇంజనీరింగ్ చదివి అందులో కూడా క్లాసు తెచ్చుకుని ఆ వెంటనే గవర్నమెంటు పోటీ పరీక్షలో నెగ్గి జూనియర్ ఇంజనీరుగా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాడు.

పోనీ, అమాయకుడేమో అనుకుందాం అంటే అదీ లాభంలేదు. ఏడెనిమిదేళ్ళు జూనియర్ ఇంజనీరు చేశాడో లేదో, ఆఫీసర్లు అందరి మన్ననలకీ పాత్రుడయి, సెలక్షన్ గ్రేడు అసిస్టెంట్ ఇంజనీరుగా ఇట్టే ప్రమోషను సంపాదించి అతని సీనియర్లందర్నీ వెర్రిమొహాలు వేసేలా చేశాడు.

కొందరు సుబ్బారావుకి ప్రపంచజ్ఞానం లేదంటారు. అదీ రైటు కాదు. ఏమంటే, పట్టుమని పది పన్నెండేళ్ళ సర్వీసుకూడా లేని ఏ ప్రభుత్వోద్యోగి సంపాదించాడు చెప్పండి, రాష్ట్ర రాజధానిలో ఒక మేడ, రాష్ట్రేతర రాజధానిలో ఓ భవంతి, వివిధ బేంకుల్లో రెండు మూడు లక్షల రెడీకేష్, ఇంట్లో లక్షరూపాయల కిమ్మతుచేసే ఫర్నిచరూ ను?

మరైతే సుబ్బారావుకి వచ్చిన లోటేవిటి?

లోటల్లా ఒకటే. అతను స్వంతంగా ఏదీ తనకు తానై ఆలోచించలేడు ఇతరు లెవరేనా తనకోసం ఆలోచించి పెట్టాలి. "ఇదీ సంగతి – నువ్విలా చెయ్యాలి. ఇలా నడుచుకోవాలి" అని ఎవరేనా కనక అతన్ని తీసికెళ్ళి పట్టాలమీద నిల్చోబెడితే, ఇంకా తర్వాత చూస్కోండి ఒకటో రకం కొత్త డీసెల్ ఇంజన్ లాగ, మాంచి స్పీడుతో చక చకా ముందుకు సాగిపోయి, విజయవంతంగా గమ్యం చేరుకుంటాడు. అతని విషయం అంతా వెనక ఉండి అతణ్ణి నడిపే డ్రైవరులో ఉంది.

మొదట్లో డ్రైవరు పని, వాళ్ళ నాన్న చేసేవాడు.
"నువ్వు ఇంజనీరింగ్ చదువు" అన్నది వాళ్ళ నాన్నే!
"ఈ ఉద్యోగంలో చేరు" అన్నది కూడా ఆయనే!
"ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకో" అన్న ఆదేశంకూడా ఆయనదే–

అయితే, సుగుణ కాపురానికి వచ్చిన తరువాత ఆ డ్రైవరు పనికాస్తా మావగారి చేతుల్లోంచి తన చేతుల్లోకి ఊళ్ళాక్కుంది. అందుకా ముసిలాయన కొత్తలో కొంత బాధపడ్డా, తర్వాత సర్దుకుని సమాధానపడి పోను పోను కోడలి చాకచక్యానికీ, సామర్థ్యానికీ తెగ సంబరపడిపోయి, ఇంకేం భయంలేదు. మా సుబ్బారావు భవిష్యత్తు సుగుణ

చేతిలో బంగారపు బాట అవుతుంది' అంటూ నిశ్చింతగా కళ్ళు మూశాడు.

సుగుణ సారథ్యం వచ్చాక సుబ్బారావు కథే మారి పోయింది.

'తీసుకుంటూన్న జీతానికి ఆఫీసులో పని చెయ్యక్ఖ ర్లేదు' అనే మొదటి పాఠం త్వరగానే నేర్చుకున్నాడు.

ఆఫీసులో అతి సీరియస్‌గా వుండడం, ఇంటి దగ్గరకు వచ్చిన మనుష్యులతో మాత్రం తియ్యగా మాట్లాడ్డం, అల వాటు చేసుకున్నాడు.

నోట్ల కట్టలు చేతిలో పడితేకాని, నోరు విప్పని మన స్తత్వం అలవరచు కున్నాడు.

ఈ సహాయానికి ఈ రేటు అంటూ ఖచ్చితమైన జంత్రీ లాంటి ఓ రేట్లపట్టిక రెడీచేసి దగ్గిర పెట్టుకున్నాడు.

తన తలకి మించిపోయిన ఏ వ్యవహారమేనా వస్తే, డైరెక్ట్‌గా భార్యనే రంగంలోకి దింపి, వచ్చిన ఆసామీలతో ఆమె చర్చిస్తూంటే, తనేం కలగ జేసుకోకుండా కళ్ళుమూసు క్కూచోవడం మొదలు పెట్టాడు.

ఒక్కొక్కప్పుడు సుగుణకూడా తన తెలివికి మించి పోయిన వ్యవహారం వస్తే, తన చిన్నప్పటి స్నేహితుడూ, ఇప్పటి బోయ్‌ఫ్రెండూ అయిన ఆనందరావుని ఆసరాగా తీసుకువచ్చేది. ఆనందరావు సర్దుబాటుచేసిన వ్యవహారం చూసి, "అబ్బ! ఆనందరావు ఎంత తెలివైనవాడు! ఈ సుగుణా ఆనందరావులు ఉన్నారు కనకే నేనిలా బ్రతక గలుగుతున్నాను కానీ, లేకపోతేనా?" అంటూ ఆశ్చర్యం, ఆనందంతోబాటు అభినందనల్ని కూడా జోడించి, తన భార్య బోయ్ ఫ్రెండ్ అయిన ఆనందరావుకి, మనస్సులో ఒక ప్రత్యేకమైన గౌరవాన్ని కేటాయించాడు సుబ్బారావు.

"ఈ వ్యవహారానికి ఎన్నివేలు పుచ్చుకోవాలి, దీన్ని ఎలా పరిష్కారం చెయ్యాలి?" అనే పెద్దపెద్ద సమస్యల దగ్గర్నుంచి ఏ గుమ్మానికి ఏ రకం డిజైనుఉన్న డోర్ కర్టెను వెయ్యాలి అనే అతి చిన్నవిషయందాకా, సమస్తమూ చర్చించి ఆలోచించి నిర్ణయించే బాధ్యతని పూర్తిగా భార్య అయిన సుగుణా, భార్య బోయ్‌ఫ్రెండ్ అయిన ఆనందరావూ స్వీకరించేసరికి, సుబ్బారావుకి హాయిగా నిశ్చింతగా కాలం గడపడం అలవాటయిపోయింది. తనంతట తానుగా ఏమీ ఆలోచించి బుర్రపాడు చేసుకోనక్కర్లేదు. తన బదులు అంతా వాళ్ళు ఆలోచించిపెడ్తారు. తన డ్యూటీ అల్లా వాళ్ళు చెప్పినట్లు తు. చ. తప్పకుండా చెయ్యడమే.

ఇలా కొన్నేళ్లుగా అలవాటయి పోయింది కనకే, ఇప్పుడు హఠాత్తుగా వచ్చిన ఈ సమస్యని ఎలా ఎదురుకోవాలో అతనికి అర్థం కాలేదు. పోనీ వాళ్లా దగ్గరలేరు. వారం పది రోజులయి ఇద్దరూ హైదరాబాదు వెళ్ళారు. ఆనందరావుకేదో పెళ్ళి సంబంధం వచ్చిందట. ఆ పిల్ల అతనికి తగునోతగదో తను చూసి నిర్ణయం చేసి సెటిల్ చెయ్యాలట! తిరిగి వచ్చేటప్పటికి వారం పదిరోజులు పట్టొచ్చని బేంక్ లోంచి వెయ్యిరూపాయలు తీసికొని ఆనందరావుతో కలిసి వెళ్ళింది సుగుణ. వాళ్ళెప్పుడొస్తారో ఏమో– వాళ్లొచ్చేదాకా మీద పడకుండా ఆగుతుందా ఈ ప్రమాదం? వెంటనే వచ్చేస్తే బాగుండును వాళ్లు. "ప్రమాదం– వెంటనే బయలుదేరి రండి" అని టెలిగ్రాంకూడా ఇచ్చాడు సుబ్బారావు వాళ్లు మకాంచేసిన త్రీస్టార్ హోటల్‌కి. నిన్ననగా టెలిగ్రాం ఇస్తే ఇప్పటికింకారాలేదు సుగుణా ఆనందరావూను.

సుబ్బారావు అస్థిమితంగా గదిలో అటూ యిటూ తిరగసాగాడు. సిగరెట్టు తీసి నోట్లో పెట్టుకున్నాడు. అగ్గిపెట్టె కనిపించలేదు. టేబిల్ సొరుగు తీశాడు– రేడియోమీద వెతికాడు. చొక్కాజేబు, ఆఖరికి వంటింట్లో గేస్ స్టౌ పక్కని అన్నీ గాలించాడు. ఉహుఁ.... విసుగొచ్చి నోట్లో ఉన్న సిగరెట్ తీసి విరిచి గోడమూలకి విసిరేసి ఉస్సూరంటూ వచ్చి పేము కుర్చీలో కూర్చున్నాడు. అతని బరువుకి కుర్చీలో ఉన్న అగ్గిపెట్టె పటపటమంటూ విరిగి పోయింది. ఓసి దీని దుంప తెగా! ఇక్కడుందా? అందుకే కనిపించ

లేదు. ఇప్పుడు కనిపించి మాత్రం ఏం లాభం? ఉన్న ఒక్క సిగరెట్టూ విరిచి అవతల పడేశాడు.

టైము చూసుకున్నాడు. తొమ్మిదికావస్తోంది. ఈ రైల్లోకూడా రాలేదు. వస్తే ఈపాటికి రాకుండా ఉంటారా? నుంచున్నచోట నుంచోకుండా, ఇల్లంతా అలగం తిరుగుతున్నాడు సుబ్బారావు. టేబిల్‌మీద నాలుగు మడతలుగా పెట్టి ఉంది, మీద పేపర్‌వైటు ఎత్తుగా పెట్టిన ఓ తెల్ల కాగితం. చుట్టచుట్టుకొని పడుకున్న తెల్లతాచులా కనిపిస్తోంది. సాఫీగా సాగుతూన్న తన జీవితాన్ని కాటువేసిన కాగితం అది! నిన్నప్రొద్దుట ఆఫీసుకి వెళుతూండగా లోకల్ టపా పుస్తకంలో సంతకం పెట్టించుకొని, బంట్రోతు అప్పన్న అందించిన కాగితం....

ఉద్యోగం లోంచి తాత్కాలికంగా తనని సస్పెండ్ చేస్తూ పై నుంచి వచ్చిన ఆర్డరు అది – ఆ ఆర్డరు పూర్తిగా చదువుకొనే సరికి, తనకి కాళ్ల కింద భూమి కదలడంతోబాటు కళ్లు చీకట్లు కమ్మాయి. మెదడంతా మొద్దుబారి వళ్లంతా చెమట్లుపట్టి నీరసంతో తూలి పడబోయి టేబిల్‌ని ఆనుకొని ఎలాగో అలాగా నిలబడ్డాడు. పదినిమిషాల్లో ఛార్జి ఎలా హేండ్ ఓవర్ చేశాడో, మరో అయిదు నిముషాల్లో ఆఫీసులోంచి ఎలా ఇవతల పడ్డాడో– ఒక్కడు కూడా సానుభూతి చూపించ లేదు. ఆఫీసులో ఏ ఒక్కడూ "అయ్యో – ఇలా అయిందా?" అని మాటవరసకే నా వలకరించలేదు.

క్షణంలో అంతా పరాయివాళ్లలా కనిపించారు. పరాయి వాణ్ని చూసినట్టు చూశారు.

ఆఫీసు గడపదాటి బయటికి వస్తూంటే వెనకనుంచి వినిపించిన ఒకటి రెండుమాటలు మాత్రం బాగా గుర్తు!

"పాపం ఎప్పుడో అప్పుడు బద్దలవక మానుతుందా?"

"అయినా అంగుడు లేకుండా మింగితే ఏమవుతుంది? ఎమర్జన్సీలో ఇంకా ఇలాంటిపిట్టలు ఎన్నిపడాలో!"

"ఇప్పటితో అయిందా? ఎంక్వయిరీ – ఇల్లుసోదా – సంపాదించిన యావత్తూ జప్తూ – ఆనక కారాగారావాసం!"

సుబ్బారావు నిలువెల్లా వణికిపోయాడు. ఏం పాలు పోలేదు. ఏమిటి చెయ్యడం? ఈ ప్రమాదం నుంచి బయట పడేదెలా? ఏం చెయ్యాలి? అది తెలియకే వెంటనే సుగుణకీ ఆనందరావుకీ టెలిగ్రాం యిచ్చేశాడు.

వాళ్లు వచ్చేస్తే బాగుండును!

ఈ ఆలోచనేదో వాళ్లుచేస్తారు.

ఈ అవస్థేదో వాళ్లు పడతారు.

అలవాటు లేకపోవడం వల్ల సుబ్బారావు బుర్ర పిస రంత కూడా ఆలోచించడం మానేసింది.

సుబ్బారావు గదిలో అలంగం తిరుగుతున్నిట్లే అతని వాచీలో సెకన్ల ముల్లుకూడా గుండ్రంగా తిరుగుతోంది. వాచీ తొమ్మిదింబావు చూపిస్తోంది.

ఇంటిముందు ఆటో రిక్షా ఆగిన చప్పుడైంది.

సుబ్బారావు వీధిలోకి చూశాడు!

సుగుణా ఆనందరావూను!

ఆటోరిక్షా వాడికి డబ్బులిచ్చి పంపేసి బ్రీఫ్ కేసులు వూపు కుంటూ నవ్వుకుంటూ లోపలికి వస్తున్నారు!

వాళ్ళని చూస్తూనే సుబ్బారావుకి ప్రాణం లేచివచ్చింది.

"అమ్మయ్య! మీరు వచ్చేశారా? ఇంక నాకు దిగులు లేదు" అంటూ సుబ్బారావు పెద్ద బరువు దిగిపోయి నట్లు గట్టిగా నిట్టూర్చి ఎదురుగుండావున్న కుర్చీలోకి కాళ్ళు జాపేసి పేముకుర్చీలో పూర్తిగా జేర్లబడిపోయాడు.

ఆనందరావూ, సుగుణా, సుబ్బారావు ఉనికిని గమ నించినట్లే లేదు. ఇద్దరూవచ్చి బ్రీఫ్ కేసులు విసిరి ఓసోఫాలో పడేసి, మరో సోఫాలో కూర్చుని పక పకా నవ్వుకోసాగారు.

"ఈ రోజుల్లోకూడా అలాంటి కంట్రిబ్యూట్స్ వుండడం ఆశ్చర్యమే!" అన్నాడు ఆనందరావు.

కబుర్లు చెప్పకు! నే నున్నాను కనక నీకీ ప్రమాదం తప్పించాను ... లేక పోతేనా?" అంది సుగుణ.

"అందుకేగా నిన్ను తీసికెళ్ళింది?" నవ్వాడు ఆనంద రావు. వాళ్ళిద్దరి కబుర్లనీ, హాయిగా నవ్వుకుంటూన్న వాళ్ళ ప్రాణస్నేహాన్నీ చూసేసరికి, సుబ్బారావుకి ఒక్క క్షణం ముచ్చటేసింది. వెంటనే తన పరిస్థితి జ్ఞాపకం వచ్చి "అవునూ? నా టెలిగ్రాం అందిందా?" అన్నాడు.

"టెలిగ్రాం ఏవిటి?" సుగుణ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"అరే-మీకు తెలియనే లేదన్న మాట!" అంటూ టేబిల్ మీద ఉన్న తన సస్పెన్షన్ కాగితాన్ని అందియ బోయాడు.

ఇంతలో ఆనందరావు "ఒక్కనిముషం ఉండండి సుబ్బారావుగారూ! ప్రయాణం చేసి చేసి ఉండడంవల్ల తల పడిపోతోంది. ఒక్క అరకప్పు కాఫీ పడితేనే కాని...." అంటూ అతణ్ణి వారించాడు.

వెంటనే సుగుణ కంగారుగా "అరే. దారిలో కాఫీ తాగే వద్దుమే? ఏమండీ ఫ్లాస్కులో కాపి ఉందా?" అంది.

"ఓం!" అంటూ సుబ్బారావు లేచి వెళ్ళి ఫ్లాస్కూ దానితోపాటు రెండు కప్పులూ పట్టుకు వచ్చాడు.

ఓ కప్పులో పోసి ఆనందరావుకి చిరునవ్వుతో అందించి, మరోకప్పులో పోసుకుని తను సిప్ చేస్తూ "మరి మీకో?" అంది సుగుణ.

"నాకు ఫర్వాలేదులే – మీరు తాగండి" అన్నాడు సుబ్బారావు. ఉత్తి నోటినే ఓ మారు గుటక వేసుకుంటూ.

ఖాళీ కప్పులు టీపాయ్‌మీద పెడుతూ "ఎలా ఉంది ఆనంద్?" అంది సుగుణ ఆదుర్దాగా.

"ఫరవాలేదు-కొంచెం సర్దుకుంది" అంటూ సోఫాకి జేర్లబడి కళ్ళు మూసు కున్నాడు ఆనందరావు.

ఇద్దరూ స్థిమితపడ్డారని గ్రహించాక. తన సస్పెన్షన్ సంగతి ప్రస్తావించాడు సుబ్బారావు.

"వ్వాట్!" అంటూ సుగుణ ఒక పిచ్చికేక పెట్టింది.

సుబ్బారావు జరిగిందంతా ఏకరువు పెట్టి, "రేపొద్దున్న ఎంక్వయిరీ చేస్తారు. ఇల్లు సోదాచేసి ఆస్థి, డబ్బు దస్కం అంతా స్వాధీనం చేసుకుంటారు. దీన్ని తప్పించుకోవడం ఎలా? మనం ఇప్పుడేం చెయ్యాలి? ఎలా తప్పించుకోవడం?" అన్నాడు.

సుగుణకి దాదాపు మతిపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కంఠం గాద్గదికమైంది. "సర్వనాశనం అయి పోయాం" అంటూ ఒక్కమారు బావురుమంది.

ఇలా ఓ పక్కన సుగుణా సుబ్బారావూ ఇద్దరూ స్థిమితంలేక తెగ కళవళ పడిపోతూంటే, సోఫాలో కూర్చున్న ఆనందరావు మాత్రం నిశ్చింతగా కళ్ళుమూసుకుని ఆ మట్టునే ఉన్నాడు.

కాస్సేపయ్యాక ఇంక ఉండబట్టలేక "ఏవిటి ఆనంద్! వింటున్నావా? నువ్వేం మాట్లాడవేం?" అంది సుగుణ చిరాగ్గా.

"అంతా వింటున్నాను. మాట్లాడడాని కేముంది? ఆ రెండిళ్ళూ, బేంక్‌లో ఎకౌంటూ, ఇంట్లో ఈ ఖరీదైన ఫర్నిచరూ, ఇవికూడా పట్టుబడ్డాయంటే ఉద్యోగం పోవడంతో బాటు చేతికి సంకెళ్ళుకూడా పడతాయి" కళ్ళు తెరవకుండానే అన్నాడు ఆనందరావు.

సుగుణ అదిరిపడింది. "ఉద్యోగం పోతుందా? పైగా జైలా?"

"మరేవిటి అనుకున్నావు?" ఆనందరావు కంఠం తొణకకుండా గంభీరంగా వినిపించింది.

"అవునా?" అన్నట్లు సుగుణ సుబ్బారావుకేసి చూసింది. సుబ్బారావు విషాదంగా తల వంచేశాడు.

"మరిప్పుడు ఏవిటి చెయ్యడం? ఆనంద్! ఈ ప్రమాదం నుంచి తప్పుకోవడం ఎలా?" అంది సుగుణ.

"అదే ఆలోచిస్తున్నా - ఎంక్వయిరీ రాకుండానే ఈ ఇళ్ళూ, బేంక్ ఎకౌంటూ యివన్నీ ఆయన ఇంకొకరిపేర పాత తారీఖులు వేసి బదిలీ చేసెయ్యాలి"

"బదిలీ చేసినంత మాత్రాన అయిందా?"

"నేరమూ శిక్షా తప్పక పోయినా అధమం ఆస్థి అయినా మిగులుతుంది. ఆస్తి డైరెక్టుగా ఆయనపేర లేక పోవడం మూలాన నేరారోపణ చెయ్యడంకూడా కొంచెం కష్టం అవుతుంది ప్రభుత్వానికి. ఫలితంగా శిక్ష కొంచెం తగ్గినా తగ్గొచ్చు.

"అయితే -ఏవండీ మొత్తం ఆస్థి డబ్బూ అంతా నాపేర రాసెయ్యండీ"

పక పకా నవ్వాడు ఆనందరావు.

సుగుణా సుబ్బారావూ ఉలిక్కిపడి అతనికేసి చూశారు. ఆనందరావు కళ్ళు తెరిచి "ఓ పిచ్చి సుగుణా! ఆస్తి నీపేర ఉంటే ఎమైనట్టు? నువ్వాయన భార్యవి కాదా? ఆ మాత్రానికి ఆయనపేర ఉన్నా ఒకటే" అన్నాడు.

"మరైతే ఎలాగ? సుగుణ ఆలోచనలో పడింది.

"పోనీ మా అన్నయ్య పేర, మా మేనమామ పిల్లల పేర రాస్తే!" సుబ్బారావు ఈ మాటలనేసరికి సుగుణా ఆనందరావు ఇద్దరూ కూడా అతనికేసి ఆశ్చర్యంగా చూశారు. ఏవిటీ? నువ్వుకూడా స్వంతంగా ఆలోచించడం అభిప్రాయం చెప్పడమూనా?" అన్నట్లుగా ఉన్నాయి వాళ్ల చూపులు. వెంటనే సుబ్బారావు సిగ్గుపడి తల వంచుకొని "అఫ్‌కోర్సు - ఆ ఆలోచన బాగోలేకపోతే వద్దులెండి" అన్నాడు.

"బాగోలేక కాదు - వాళ్ళూ మీకు చుట్టాలేకదా? ఏ రకంగానూ బాంధవ్యం లేని వాళ్ళపేర రాయడం శ్రేయస్కరం. పైగా ఇవాళ మీరు వాళ్ళని నమ్మి రాసిస్తారు. సరే రేపొద్దున్న పరిస్థితులన్నీ చక్కబడ్డాక వాళ్ళు తిరిగి మీఆస్థి మీకు రాసివ్వాలి కదా?-అలా ఇస్తారా?- ఇస్తారని నమ్మకం ఉంటే పోనీ అలాగే రాసివ్వండి" —"నో.... నో.... వాళ్లకి రాయడానికి నేను ఒప్పుకోను" అంది సుగుణ.

సుబ్బారావు నిస్సహాయంగా ఆమెకేసి చూశాడు.

కాసేపు ఎవ్వరూ మాట్లాడలేదు. ఒక్కక్షణం ఆగి "పోనీ ఆనంద్- ఇదంతా నీ పేరే రాయించుకుంటే?" అంది సుగుణ.

"నా పేరా?" ఆనంద్ సుబ్బారావువైపు చూశాడు.

సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. ఎప్పుడూ లేంది సుబ్బారావు మెదడు కాస్త ఆలోచించడం ప్రారంభించింది.

సుబ్బారావు మౌనంగా ఉండడం చూసి ఆనందరావు నిర్లి ప్తంగా బుజాలు ఓ మారు పైకి లాక్కుని "నాకెందు కొచ్చిన జంజాటన. ఇదంతా లేనిపోనిది. అయినా సుగుణా! ఏవిటి నీ వెర్రి? మనిద్దరం ఫ్రెండ్స్ కనుక చటుక్కున అలా అనేశావు? నీకున్న పాటి నమ్మకం నా మీద ఆయనకి ఉండొద్దూ?" అంటూ నీరసంగా నవ్వాడు.

దాంతో సుగుణకి కోపం వచ్చింది. కోపంగా భర్త కేసి పుల్తూ పుల్తూ చూసింది. సుబ్బారావు ఇబ్బందిగా ఫీలయ్యాడు. అయినా ఏం మాట్లాడలేదు. మౌనంగా ఊరుకున్నాడు. ఆనందరావు సుబ్బారావు నోమారు నిశితంగా పరిశీలించి చూసి "సుగుణా! ఇంకా టాపిక్ వదిలెయ్యి. ఆయనకి సంపూ ర్ణంగా నమ్మకం ఉన్న మరో మార్గం ఆలోచిద్దాం" అన్నాడు.

సుగుణకి భర్త మీద కోపం, విసుగూ చిరాకూ, అసహ్యం అన్నీ ఒక్క మారుగా కలిగాయి.

"ఏవండీ! మాట్లాడరేం? ఆనంద్ మీద మీకు నమ్మకం లేదా? అయినా ఈ ఏడెనిమిదేళ్ళ నుంచీ అతనిచ్చిన సల హాలూ ఆలోచనల వల్లే కదాండి మనకింత డబ్బూ ఆస్థి వచ్చింది? ఓ రకంగా చూస్తే ఇదంతా అతనిదే- మీ మౌనం చాలా ఇన్సల్టింగ్‌గా ఉంది. నా ఫ్రెండ్‌ని నా ముందు అవ మాన పరిస్తే నేను సహించలేను." గట్టిగా అరిచింది సుగుణ.

సుబ్బారావు అదిరి పడ్డాడు. వెంటనే తబ్బిబ్బుపడి తడ బడుతూ "అబ్బే!.... ఆనందరావుగారి పట్ల నాకు అనుమానం ఏమిటి?.... ఓ....అలాగే....ఆయన చెప్పిందే మంచి మార్గం, అలాగే చేద్దాం" అన్నాడు.

"ఇదేదో మొహమాటపడి...."

"అబ్బెబ్బే! అలా ఒక్కనాటికి అనుకోకండి. నా యవదాస్థి మీరిప్పుడు రాయించుకుంటున్నారంటే నాకు ఒక గొప్ప మహోపకారం చేస్తున్నారన్నమాట. నన్ని ఆపదనుంచి రక్షించడం కోసమే మీరీ త్యాగం చేస్తున్నారు" అంటూ సుబ్బారావు ఆనందరావు చేతులు పట్టుకోవడంతో సుగుణ సంతోషం అవధులు దాటింది. ఆమెకి ఆనందంతో కళ్ళు చెమర్చి కంఠం బొంగురు పోయింది.

ఆ రోజే పాత దస్తావేజుల్ని ఆనందరావు పట్టుకు రావడం. రాయవలసిన రీతిగా రాసేసి సుబ్బారావు సంతకాలు పెట్టేయడం జరిగిపోయింది. రెండిళ్ళూ అతనిపేర రాయ డంతోపాటు, బేంక్ ఫిక్సెడ్ డిపాజిట్లు కూడా ఆనందరావు పేర బదిలీ చేసి, హమ్మయ్యా అని చేతులు దులుపుకొని స్వేచ్ఛగా, గాలి పీల్చుకున్నాడు సుబ్బారావు. రెండ్రోజుల్లో వస్తానని వెళ్ళాడు ఆనంద్.

ఇది జరిగి ఆర్నెల్లు కావచ్చింది.

అప్పటికీ ఇప్పటికీ ఆనందరావు తిరిగి రాలేదు.

ఎంక్వయిరీ, ఇల్లు సోదా వగైరాలు జరిగి సుబ్బా

రావు ఉద్యోగం మాత్రం పోయింది. అయితే జైలుశిక్ష పడలేదు. ఇంట్లో ఫ్రిజ్, సోఫాలు, డైనింగు టేబిలూ, డబుల్ కాట్ వగైరా ఫర్నీచరూ, సెకండ్ హాండ్ ఫర్నీచరు కొట్టుకి నడిచాయి. ఇల్లు బోసిగా మారింది. సుగుణ బెంగతో చిక్కి శల్యం అయింది. రెండుచేతుల్తోటి పుష్కలంగా సంపాదించే భర్త ఇలా గోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చోవడం, పూర్వపు ఉద్యోగం వైభవం అన్నీపోయి ఇంట్లో దారిద్ర్యం అశాంతీ చోటు వేసుకోవడం, వీటి కారణంగా భార్య బెంగ పెట్టుకుంది అనుకున్నాడు సుబ్బారావు. కానీ 'ఆస్థి, డబ్బూ, భర్త ఉద్యోగం, అన్నీ పోతేపోయాయి. నిక్షేపంలాంటి బోయ్ ఫ్రెండ్ దక్కకుండా వెళ్ళిపోయాడే? ఎక్కడికి వెళ్ళాడో ఏమయ్యాడో అనే బెంగతోనే ఆమె మంచం ఎక్కిందనే సంగతి అర్థంకాలేదు. సుబ్బారావుకి- ఆనందరావుని వెతుక్కుంటూ సుగుణ ఒకరోజున ఇంట్లోంచి హఠాత్తుగా వెళ్ళిపోయిన తర్వాత ఆలశ్యంగా అర్థం అయింది సుబ్బారావుకి, భార్య ఎందుకు ఇన్నాళ్ళూ బెంగపెట్టుకున్నదీను- తర్వాత అతనికి లోకానుభవం, గడుసుదనం, ఆలోచించే శక్తీ అన్నీ వచ్చాయి అయితే ఏం లాభం? "లంచాలు వచ్చే జీతం - బోయ్‌ఫ్రెండ్ ఉన్న భార్యతో జీవితం" ఈ రెండూ శత్రువుకి కూడా వద్దు బాబోయ్ అంటాడు, ఇవాళ అతణ్ణి ఎవరేనా ఓ ఆలోచనో, సలహానో చెప్పండి అని అడిగితే పాపం సుబ్బారావు.

—o—

(స్వాతి)